'స్వాతి' మాసపత్రిక - మార్చి - ఏప్రిల్, 1983

# నైజ గుణాలు

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ కదలడానికి సిద్ధంగా వుంది. కరంటు కొరత కలకత్తా ప్రజలకి గాని స్టేషనుకి కాదన్నట్టు దేదీప్యమానంగా వెలిగిపోతోంది హౌరా స్టేషన్.

అక్కడ వెలుగెంతంతగా విరాజిల్లుతున్నదో చలి కూడా అంతకన్న మిన్నగా వీరవిహారం చేస్తోంది. చలి చిక్కచిక్కగా, దట్టంగా, మంచులా, మాయలా, వరదలా చేరుకుపోయి, పేరుకుపోయి గజగజలాడించేస్తోంది. వజవజ వణికించేస్తోంది.

చలి వణికించగలదేగాని పనులను స్తంభింపచేయలేదు గదా!

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ చలికి జంకినా, సిగ్నలు ఇవ్వగనే - పచ్చలైటు వూపగనే, విజిల్ వినిపించగనే బాధ్యత, డ్యూటీ, ధర్మం అనేవి భుజం చరిచి హుషారిచ్చి కదలు కదలమన్నాయి. చలిని, చీకటిని చీల్చుకుపొమ్మన్నాయి.

కోరమాండల్ కదిలింది.

వందల వందల చేతులతో వీడ్కోలు చెబుతోంది ప్లాట్‌ఫామ్ - ఈ మధ్య రైలు ప్రమాదాల జోరు గుర్తుకు రాగా సన్నగా వణుకుతూ!

స్టేషన్ని రైలు వదిలేసింది. చలి మాత్రం రైలుని వదల్లేదు. నిండా మునిగేక చలేం విటంది రైలు. పాసెంజర్లు చలికేమాత్రం చోటివ్వకుండా, నిర్దాక్షిణ్యంగా కిటికీ తలుపులు మూసేసారు. చలికి చిర్రెత్తుకొచ్చి, సూక్ష్మరూపం ధరించి కిటికీల సందుల్లోంచి, తలుపుల గొందుల్లోంచి చొరబడిపోయి పాసెంజర్ల గుండెలను గుద్దేస్తోంది; చేతి వేళ్ళను, కాళ్ళ వేళ్ళను చల్లగా కొరికేస్తోంది. దెబ్బతో పాసెంజర్లు స్వెట్టర్లు, రగ్గులు వెదుక్కుంటున్నారు.

అంత చలిలో కేబిన్ తలుపులు తెరిచి వుండడం చూసి ఆశ్చర్యపోయేడు ఫస్టుక్లాసు కంపార్టుమెంటు కండక్టరు.

కుడివైపు సీటులో ముప్పయి మూడేళ్ళ యువకుడు.

యువకుడి కెదురు సీటులో పాతికేళ్ళ పడుచు.

పడుచు చేతిలో పాప. యువకుడి చేతిలో పేపరు.

సర్‌చార్జి రశీదు ఇచ్చేటప్పుడు అతని పేరు ప్రకాష్ అనీ, ఆమె పేరు పద్మ అని తెల్సుకున్నాడు. తెల్సుకోడం వల్ల వచ్చిన లాభం ఏమీలేదు. సర్‌ఛార్జి ఇద్దరూ వేర్వేరుగా చెల్లించడంతో - ఒకరికొకరు వాళ్ళిద్దరూ ఏమీ కారేమో అనే అనుమానం వచ్చింది. దానివల్ల తనకి కూడా లాభం లేదు. అవును, అతనికిలాంటివి లాభం లేదు - లంచాలు తప్ప లంచానికి మంచవిచ్చి లాభం లాగుదామనుకుంటే ఈరోజు చలిచేతో, మరెంచేతో ఫస్టు క్లాసు పెద్ద రద్దీగా లేదు. అంతమాత్రం చేత అతనేం డీలాపడిపోనూలేదు నీరుకారిపోనూ లేదు. ఎందుకంటే అతని కెప్పుడూ మంచిరోజులే! లాభాల సంచులే!

కండక్టరు పోతూ - కేబిన్ డోర్ వేసేసాడు.

ప్రకాష్ ఇబ్బందిగా కదిలేడు.

ఎందుకు ఇబ్బంది?

ఫస్టుక్లాసు పరుపుల సుఖం ఎలానూ వుంది. ఈ చలిలో, ఈ పరుపులో పరువాల పడతి సుఖం ఎదురుగా వుంది - ఎరకి పడితే ఈ రాత్రంతా నీదే! ఈ సుఖవంతా నీదే!- ప్రకాష్‌కి ఆ విధమైన ఆలోచనలు చేయడం ఇష్టముండదు.

ఫస్టుక్లాసు పరుపు సుఖానికి అతనికి వైజాగు వరకూ రైటుంది. ఆమె తనది కాదు. ఆమెపై అతని కెటువంటి రైటు లేదు. తోటి ప్రయాణీకురాలు మాత్రమే - దట్సాల్! ఎటువంటి

పాడు ఆలోచనలు కలిగినా తనదే తప్పవుతుంది.

తప్పు చేయడని ఆ సమయానికి అతనికెంతో నమ్మకం వుంది. అయితే తన సంస్కారం ఆమెకెలా తెలుస్తుంది? అంచేత సహజంగానే ఆమె భయపడుతుంది.

ఆమె భయపడుతుందని భావించడంచేతనే ప్రకాష్ ధైర్యంగా డోర్ క్లోజు చేయలేక పోయేడు - ఎంత చలిచలిగా వున్నా! అయితే ఆ పుణ్యమేదో కండక్టరు కట్టుకొని వెళ్ళి పోయేడు. చలి తగ్గింది.

ఆమె సీటు ఏ లేడీస్ దగ్గరో ఎడ్జస్టు చేయరా నాయినా అని కండక్టర్ని అడగొచ్చు కాని ఎందుకడగాలి?

భయపడితే ఆమె భయపడాలి, సీటు ఛేంజ్ అడిగితే ఆమె అడగాలి - అంతేగాని తనెందుకడగాలి?

ఏది ఏమైనప్పటికి ఇబ్బందిగానే వుంది అతనికి.

ఇబ్బందిని ఎదుర్కోడానికి ఆమెకీ తనకీ తెరగా పేపరు!

పేపరు అడ్డుపెట్టుకున్నా ఆమె రూపం, ఆమె సౌందర్యం అచ్చుగుద్దినట్టు అది తప్ప మరేమీ కన్పించడం లేదు. కంగారు పడ్డాడు. అద్భుతమైన ఆమె సౌందర్యానికి ఆకర్షితుడై తన హృదయం షేక్ అవుతుందనుకోవడం అతని కిష్టం లేకపోయింది. ఆమె అందానికే అంతటి శక్తి వుందనుకోవడంలో తృప్తి లభించింది. అదేం తప్పు కాదనిపించింది.

గత ఆర్నెల్లుగా స్త్రీ సుఖానికి తను దూరంగా వున్నాడు. స్త్రీ సుఖానికే కాదు యావత్ కుటుంబాన్ని విడిచి ఎక్కడో వూరూ, పేరూ లేని అస్సాం అడవుల్లో డ్రై లైఫ్! డ్యూటీ మీద అయిదారు నెలలు కాంప్ అక్కడ పడుతోంది. ఏడాదికి రెండు, మూడు నెలలు కూడా వైజాగ్‌లో పెళ్ళాం, పిల్లల చెంత వుండడం కష్టమవుతోంది.

ఆ అడవిలో కాంట్రాక్టు కూలీలలో అందమైన, బిగువైన ఆడపిల్లలు లేకపోలేదు. గదికి పిలిస్తే రాకపోరు. కాని తనకా ఉద్దేశం లేదు. స్త్రీ సుఖం భార్య నుంచి తప్ప మరే స్త్రీ నుంచి పొందడం అతని స్వభావానికి సరిపడదు - ఎంతటి అవకాశం ఎదురొచ్చి నప్పటికి!

కాలక్షేపం కోసం తోటి ప్రయాణీకుల్ని మాటల్లోకి దింపే అలవాటుంది ప్రకాష్‌కి. అలాన్చెప్పి ఈ ఆడ ప్రయాణీకురాల్ని మాటల్లోకి దింపడానికి ధైర్యం చాల్లేదు. 'ఒంటరి ఆడదాన్ని ట్రాప్ చేస్తున్నాడు వెధవ' అని అనుకుంటే!

ఆమె వడిలో కూర్చున్న పాప బిస్కట్లు మీద బిస్కట్లు లాగించేస్తోంది.

పాప బొద్దుగా వుంది. ముచ్చటగా వుంది. ముద్దొస్తోంది. అసలు పేరు ఏవిఁటో గాని, తల్లి ముద్దుగా 'పప్పీ' అని పిలుస్తోంది.

పప్పీ తనకేసి అదే పనిగా చూడ్డంతో చేతులు చాచబోయేడు ప్రకాష్. అది కూడా ఆ తల్లి ఒక ఎత్తుగడగా భావిస్తుందని తోచి విరమించుకున్నాడు.

పేపరుని తెరగా ఎరేంజ్ చేయడం చేత కలిగిన అసౌకర్యం వల్ల చేతులు పీకేయి.

పేపరు పేజీలు తిప్పేడు. చూపులు అప్రయత్నంగా అటు మళ్ళేయి.

మిలమిలా మెరుస్తూ కళ్ళు!

'ఆమె కళ్ళెంత బాగున్నాయి!' అనుకున్నంత వరకూ తప్పు లేదు. ప్రమాదం లేదు. కాని –

గభాల్న ప్రకాష్ చూపులు చురుగ్గా అటు మళ్ళేయి.

అది ప్రమాదం!

పద్మ స్వెట్టర్ తొడుక్కుంటోంది. తొడుక్కున్నప్పుడు పవిఁట పంటి కింద కెళ్ళుట... పప్పీ చేయి తగిలి పవిఁట జారుట.. గుండెలు ఎత్తుగా జాకిట్లోంచి ఉబికి... మెత్తగా మెరుస్తూ ప్రకాష్‌ని గాభరా, గాభరా పెట్టుట... ఆమె వెంటనే, వెన్వెంటనే పవిఁట చప్పున సర్దుకొనుట.. అంతా రెండే రెండు క్షణాలు!

ఆ రెండు క్షణాలే చాలు, చాల్చాలు ప్రాణాలు తోడేయడానికి! ప్రమాదాలు పట్టించడానికి!

చివరి క్షణంలో ఆమె చూపులకి దొరికిపోయేడు ప్రకాష్.

చప్న నిద్రలోకి జారుకోడం మంచిది, మంచిది.

నిద్ర పట్టేస్తే ఏ గొడవా వుండదు. నిద్రపోతే – వెధవ శరీరాన్ని వేడెక్కించే భాగాలన్ని ఒళ్ళు తెలీకుండా నోరు మూసుకు విశ్రాంతి తీసుకుంటాయి. అప్పుడీ గుండె కొట్టుకోవడం వుండదు. అప్పుడీ రక్తం సలసల కాగి వురుకుల పరుగులెట్టదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు డిసిప్లెన్ తప్పి బుద్ధిహీనంగా ప్రవర్తించవు. శరీరాన్ని మండించే గ్రంథులు మండవు. వేగించే నరాలు వేగవు... మెదడుతో కనెక్షన్లు తప్పి ఆ గ్రంథులూ, నరాలూ నిలకడగా వుంటాయి.. అంచేత, నాయినా పడుకోడం బెటరు!

సీటులోంచి లేచేడు. సీటుని పడుకునే పక్కగా మార్చేడు.

పక్క విశాలమయింది.

ఫేంట్‌లోంచి లుంగీలోకి మారుదామనుకున్నాడు. ఆమె ఎదుట... ధైర్యం చాల్లేదు!

ఫేంట్‌తోనే పడుకున్నాడు. చెవులకి మఫ్లరు చుట్టుకున్నాడు. రగ్గు చెవుల వరకూ లాగుకున్నాడు.

ప్రాణం సుఖంగా, హాయిగా వున్నట్టనిపించింది ప్రకాష్‌కి.

అస్సాం నుంచి బయల్దేరిన కానించి యింతవరకు అతని ప్రయాణం చికాకు, చికాకుగానే సాగింది. కాస్త నడుం వాల్చింది ఇపుడే.

ఆకలి కూడా వేయడం లేదు. సాయంత్రం చేసిన టిఫిన్ ఇంకా బరువుగానే వుంది. కాటరింగ్ మీల్స్ తినడం ఇష్టం లేదు. అంత డబ్బు వేయలేడు. వేసి, ఆ చెత్త తినలేడు ఎందుకైనా మంచిదని ఒక రొట్టె బాగ్‌లో పెట్టుకున్నాడు. కాని తినాలనిపించలేదు.

ఎందుకో సడెన్‌గా అతని ఆలోచనలు పెళ్లాం మీదకీ, పిల్లల మీదకీ మళ్ళేయి. చంటివాడికి జ్వరంగా వుందని ఉత్తరం వచ్చింది – వారం క్రిందట. ఇపుడెలా వుందో ఏవిటో. ఆడదొక్కతీ

పిల్లలతో ఏం శ్రమపడుతుందో, ఎలా వుందో? ప్రకాష్ కళ్ళు చెమర్చేయి.

పెళ్ళాం, పిల్లలకి ఎడంగా, బహుదూరంగా తను... హు! ఏం బతుకైపోయింది? ఉద్యోగాలపై ఆధారపడే బతుకులు అంతే అనుకోవాలా? అవును మరి, అస్సాం అడవులేమిటి? అండమాన్ వెళ్ళమన్నా వెళ్ళాలి. ఎందుకు, కాదు, కుదరదు అని మనం అనగూడదు, అనినా చెల్లదు గాక చెల్లదు.

చంటి పిల్లలు సార్, తల్లి రోగిష్టిది సార్, అది బతకదు సార్, మా ఆవిడికి ఒంటరిగా వుండాలంటే చచ్చేటంత భయం సార్, నేను తప్ప మా ఇంటికి మగదిక్కు మరెవరూ మాలో లేరు సార్, నా మాట నమ్మండి సార్, సార్సార్ దయుంచండి సార్ - ఇలాంటి ప్రార్థనలు అరణ్యరోదనలు. ఫలితం కనిపించదు.

ఓం ప్రథమంగా ఉద్యోగంలో చేరేటప్పుడు - 'ఇండియాలో ఏ ప్రాంతమునందైనను నేను పనిచేయుటకు ఇందుమూలంగా నా సమ్మతి తెలియజేయుచున్నవాడను' అని ప్రతి ఒక్కరూ బాండ్‌పై సంతకం పెట్టి జాయిన్ అవుతారనేది అతనికి తెలీని విషయం కాదు.

తన సర్వీసు నిజంగా అస్సాం అడవులకి అవసరమై తరచుగా పెద్ద కాంపులు తగలడం జరుగుతోందని నమ్మేటంత వెర్రివాడు కాదు ప్రకాష్.

ప్రకాష్‌కి తెలుసు- అది కంపెనీ యజమాని - రవీంద్ర కుట్రని!

అవును కుట్ర! ముమ్మాటికీ కుట్రే!

అది కుట్రగా అంగీకరించని వాళ్ళు అతని ఉద్యోగం వూడపీకేసే బదులు ఎంతో దయతో కన్‌స్ట్రక్షన్ డివిజన్‌కి ట్రాన్స్‌ఫర్ చేయడం జరిగిందని అనొచ్చు. ఎప్పటికప్పుడు కేంప్ అంటూ నెలల తరబడి అడవులకి తోలేయడం - తప్పదు మరి ఏం చేస్తాం. ఆ పని ఎవడోకడు చేయాల్సిందే గదా అని సమర్థించవచ్చు. కాని అదే డిపార్టుమెంటుకి సంబంధించిన మిగతా వాళ్ళ ఉద్యోగాలు అతనికి మల్లే తగలడుతున్నాయా అంటే లేదు, . లేదని సమాధానం చెప్పాల్సి వస్తుంది. అంచేత అది 'కుట్ర' అనే అభియోగాన్ని తేలిగ్గా కొట్టిపారేయడానికి వీల్లేదు.

అలా అనిపించడంతో దీని వెనుక పెద్ద కథేదో జరిగుంటుందని తోస్తుంది. తోచేక, ఆ కథ విన్నాక, అవున్సార్, అది కుట్రే అని ఒప్పుకోక తప్పదనిపిస్తుంది.

గత రెండేళ్ళుగా ప్రకాష్‌ని ఏడిపిస్తున్న తీరుని చూసి, ఆ కంపెనీ యజమాని రవీంద్ర పరమ, పరమ దుర్మార్గుడనిపిస్తుంది.

ప్రకాష్ పెళ్ళాం బిడ్డల్ని, వాళ్ళ బాధల్ని చూస్తే - ఆ వుసురు ఆ రవీంద్ర పెళ్ళాం పిల్లలకి తగలకుండా పోద్దా అనిపిస్తుంది.

పెద్ద అవులింత వచ్చింది ప్రకాష్‌కి.

టైము చూసేడు ఏడున్నర.

ఇంక ఎంతసేపు! కళ్ళు మూసుకుపడుకుంటే తెల్లారి యించుమించు ఇదే టైముకి వాల్తేరులో

వాల్తాడు. పెళ్ళాం బిడ్డల్ని చూస్తాడు. (తను వెళ్తున్నది పెళ్ళాం బిడ్డల్ని చూడ్డం కోసం మాత్రం కాదు - డ్యూటీ మీద దిగుతున్నాడు).

కళ్ళు మూసుకు లేస్తే వైజాగ్‌లో వుంటానన్న ఫీలింగ్ అతనికెంతో హాయి కలిగించింది.

ఎంత వేగం! ఎంత సుఖం!

జీవితాన్ని సుఖమయం చేస్తున్న ఈ నాగరికతదెంత స్పీడు!

ఏమాత్రం నిలబడి వూపిరి తీసుకోనివ్వని స్పీడు. ఈ స్పీడు మనిషిని ఎక్కడికి, ఏ తీరాలకి తీసుకువెళ్తుందో ఈ ప్రయాణంలో, నిరంతరయానంలో ఎక్కడ దిగుతాడో, ఎంతవరకు కొనసాగుతాడో ఆ మనిషికే తెలీని స్థితి!

స్పీడ్, స్పీడ్... లైఫంతా స్పీడ్.

కోరమాండల్ మాంచి స్పీడులో వుంది.

ప్రకాష్‌కి చలిచలిగా, వెచ్చవెచ్చగా వుంది.

ఆమె వైపు చూసేడు. చదువుకుంటోంది ఏదో తెలుగు పత్రిక!.. అనగా ఆమె తెలుగు సుందరేనని తేటతెల్లమవుతున్నది కదా....

ప్రకాష్‌కి లైటుంటే నిద్ర పట్టదు. కాని తప్పదు. పడుకునే ముందు తలుపు లోన గెడ వేయాలి - వేయక తప్పదు. లఘుశంక! వచ్చినట్టు లేవక తప్పదు.. శీతాకాలం చీటికి మాటికి ఇదొక ఇబ్బంది.

ప్రకాష్ లేచి, టాయిలెట్‌కి పోయి వచ్చేడు.

కాబిన్ డోర్ వేసి - 'గెడ వేయడం మీకు అభ్యంతరం లేదు కదా!" అని ఆమెని అడిగేడు - తప్పదు!

'అరె! మీకు మాటలొచ్చన్నమాట!' అన్నట్టు ఆమె చూసింది.

ఎక్కడ అపార్థంచేసుకుంటుందోనని 'దొంగల భయం' అని తెలియజేసాడు.

ఆమె బెదిరినట్టనిపించింది.

ఆమెకూ వెంటనే టాయిలెట్‌కి వెళ్ళాల్సిన అవసరం వచ్చినట్టుంది.

లేచింది.

'ఒన్ మినిట్' అంటూ కదలబోతే పప్పీ తల్లిని చుట్టేసింది.

విధిలేక, పాపను ఎత్తుకువెళ్ళడానికే సిద్ధపడింది.

ప్రకాష్‌కి అర్థమయి, చొరవగా "ఫర్వాలేదు, పాపనిలా ఇవ్వండి" అన్నాడు.

ఆమె "థాంక్స్" అంటూ పిల్లని అతని చేతికిచ్చి వెళ్ళింది.

వెళ్ళేటప్పుడు ఆమెకిబ్బంది కలగకుండా డోర్ తెరిచేడు. మరో థాంక్స్ పారేసింది.

ముద్దులొలికే పాప చేతికి రావడంతో - ముద్దులాడబోయేడు ప్రకాష్.

అంతవరకూ బిక్కచచ్చిపోయి వుండిపోయిన పాప కేర్ మంది.

ప్రకాష్‌కి కంగారయింది. సముదాయించబోయేడు.

అంతలోనే పద్మ వచ్చేసింది.

చప్పున పాపని ఒళ్ళోకి తీసుకుని తన లగేజ్ కేసి... అన్ని సామాన్లు వున్నదీ, లేనిదీ చూసుకుంది. ఎదుటి వ్యక్తి గ్రహిస్తే బాధపడతాడనే సంగతి ఆమెకి తోచినట్టులేదు.

ఆమె భయం ప్రకాష్‌కి అర్ధమయింది. బాధపడలేదు. పైగా ఆ భయం సహజమైనదిగా భావించేడు. నిజానికి పసిపిల్లతో, ఇంత లగేజ్‌తో వంటరిగా రాత్రి ప్రయాణం చేస్తున్న ఆమె సాహసాన్ని అభినందించాలి.

ఇంతకీ పాపం ఆమె టాయిలెట్ డోర్ దాకైనా వెళ్ళిందాని!

స్థితిస్థాపకశక్తి మెదడు కంట్రోలు దాటిపోయినపుడు చచ్చినట్టు టాయిలెటుకి పరిగెత్తక తప్పదు. అప్పుడు పిల్లా లేదు. లగేజు లేదు! ఒకటే పరుగెత్తాలి. అంటే ఏవిటన్నమాటా! నాది, సొంతం అనే భావన - భ్రమ, భయం. దొడ్లో కెళ్ళడమనే చర్య - సత్యం, అనివార్యం అన్నమాట!.. తన పిచ్చి పిచ్చి ఆలోచనలకి నవ్వుకున్నాడు.

కాటరింగ్ మీల్స్ వచ్చింది.

పద్మ తిని, పప్పీకి తినిపించింది.

చూస్తున్నాడు కదూ... ఆ పాప తిండి!.. అదే పనిగా ఏదో ఒకటి అలా మేస్తూనే వుంది! సీటుని బెడ్‌గా మార్చుకోడంలో పద్మ ఇబ్బంది పడుతుంటే ప్రకాష్ కలుగజేసుకుని తనే అమర్చేడు.

థాంక్స్ చెప్పింది పద్మ.

పాపని పడుకోబెట్టి ఆమె కిటికీ వార కూర్చుంది.

ఆమె కెదురుగా ప్రకాష్ కూర్చున్నాడు. ఆమెతో మాట్లాడాలనే అతని తహతహ... ఆమెను మాటల్లోకి దించేటట్టు చేసింది. తన పేరు పరిచయం చేసుకున్నాడు. పొడిగా ఆమె పేరు మాత్రమే చెప్పింది.

"ఎక్కడవరకు వెళ్తున్నా"రని అడిగేడు.

"వైజాగ్"

"నేను కూడా" అన్నాడు - ఆమె అడగకపోయినా.

ఆమెతో మాట్లాడుతుంటే తనకేదో థ్రిల్‌గా, అదో హాయిగా వుంది.

"ఏం చేస్తుంటారు మీరు?" - అతని గురించి ఆమె అడిగిన ఒకే ఒక ప్రశ్న!

"కనస్ట్రక్షన్ డివిజన్‌లో వర్కర్ని. ట్రేడు - మెకానిక్ గ్రేడ్ వన్"

పద్మ పెద్ద ఆశ్చర్యపోయి "వ్వాట్!" అనేసింది పైకే.

నవ్వొచ్చింది ప్రకాష్‌కి. వున్న విషయం దాచి గప్పాలు కొట్టి, లేని గొప్పలు చెప్పే మనిషి కాదు ప్రకాష్. ఒకరకంగా ఆమె అనవసరంగా, అలా ఆశ్చర్యపోవడం సరదా కలిగించింది కూడా!

"ఏవిటలా ఆశ్చర్యపోతున్నారు! వర్కరేవిటి?... ఫస్టు క్లాసులో మీ లాంటి పెద్దలతో

సమంగా ప్రయాణం ఏంటనా?.. ఇందులో నా గొప్పేమీ లేదండి. మా కంపెనీలో 425 బేసిక్ పే దాటిన ప్రతివాడు... ఫస్టు క్లాస్ జర్నీకి అర్హుడే!" అన్నాడు నవ్వుతూ.

"ఓహో" అంది. గొంతు సరిగా పెగల్లేదు. ఆమె సంస్కారం అతన్ని చాలా చిన్నచూపు చూసింది. ఆ చూడ్డంలో తను బయట పడిపోతున్నాననే సంగతి తెలీడం లేదు. బాల్కనీ టికెట్ రిక్షావాడు కొని, హాల్లో తన పక్కన సమంగా కూర్చున్నట్టు ఫీలయింది. ఫస్టు క్లాసు విలువ, పరువు పోతుండడడానికి ఇదొక ఉదాహరణగా తోచింది. దేశం ఏ గతికి దిగజారిపోతోంది!... లైఫ్‌లో ఆమె తక్కువ తరగతి కంపెనీతో ప్రయాణం చేసే దౌర్భాగ్యం బహుశా ఇదే ఫస్టు టైమని తోచగానే ఆమెకి గొప్ప చికాకేసింది.

పద్మ తండ్రి పెద్ద పారిశ్రామికవేత్త. పెద్ద పెద్ద భవంతుల్లో పెరిగింది. కాన్వెంటుల్లో చదివింది. ఖరీదైన స్నేహితులతో, ఇంపోర్టెడ్ కారుల్లో తిరిగింది. ఇపుడో పెద్ద కంపెనీ యజమాని భార్య! లీలామనోహరన్, స్వప్న చక్రవర్తీ, అశాజగ్‌మోహన్ సింగ్, సుమిత్రారెడ్డి, సుచిత్రా ఛటర్జీ వగైరా వగైరాలు తన స్నేహితులు. వాళ్ళు సామాన్యులు కాదు – బడా అధికారుల ముద్దుగుమ్మలు. కంపెనీ యజమానులకు యాజమానురాళ్ళు!

అటువంటిది ఒక ఫస్టుక్లాసు కాబిన్‌లో తనతో సమంగా ఒక సామాన్యుడు కూర్చొని కబుర్లాడడం చికాకు గానే కాదు, డామ్ సిగ్గుగా వుంది. అతని ప్లేసులో ఏ బడా పారిశ్రామిక వేత్తో, ఏ పెద్ద అధికారో వుంటే ఎంత బాగుణ్ణు!

అసలు వర్కర్లకి ఫస్టు క్లాసులేవిటి? నాన్సెన్సు! కంపెనీ రూల్సూ, రెగ్యులేషను ఏ 1947లో ఏర్పడ్డవి అలా వుండిపోగా రూపాయి విలువ పైసలకి పడిపోయి – ఆ పైసల విలువతో ఫస్టు క్లాసు ఫెసిలిటీస్ వర్కర్ వెధవలు కొట్టేస్తున్నారు. లాభం లేదు! రూల్సు మార్చాలి ఆక్టులు సవరించాలి. ఇది చాలా తీవ్రమైన విషయం. ఇది తన భర్తతోనే కాదు, తన సర్కిల్ అందరిలో కదపాలి. కదపటం కాదు – రూల్సు మార్చేట్టు చేయాలి. తప్పదు అనుకుంది.

మనిషికీ మనషికి మధ్య ఆస్తి ఆదాయాలలో అంతులేని వ్యత్యాసం వున్నప్పుడు సంఘర్షణ అనివార్యం. సామరస్యం, సుహృద్భావం లాంటి తీయటి మాటలు ఎన్ని చెప్పినా, నచ్చచెప్పినా కలసి మనలేరుగాక మనలేరు.

ప్రకాష్ ఇంచుమించు ఆమె ఆలోచనలన్నీ కనిపెట్టగల్గుతున్నాడు. కనిపెట్టడం అనేది అతనికి పుట్టుకతో వచ్చిన విద్య. ఆ విద్య సహాయంతో ఆమె ఊహలు చదవడం అతనికి కుతూహలంగానే వుంది. ఆమెను ఇంకా మాటల్లోకి దింపి రెచ్చగొట్టాలని కూడా అనిపించింది.

"ఇంతకీ... మీరు ఎవరో చెప్పారు కాదు!... మీరు నాలాంటి సామాన్యులు కారని మిమ్మల్ని చూడగానే తెలుస్తుంది"

తనెవరో తన హోదా ఏమిటో తెలియజేసే అవకాశం వచ్చింది.

బహుశా అందుకోసమే ఆమె ఎదురు చూస్తున్నదేమో!

తను ఫలానా కంపెనీ యజమాని భార్యనని చెప్పింది. చెప్పడం చాలా ఠీవిగా, గర్వంగా..

ఒక రకంగా కసిగా కూడా చెప్పింది.

ప్రకాష్ అది విని పెద్ద షాక్ తినేసాడు.

పద్మ.. తన కంపెనీ యజమాని రవీంద్ర భార్యని తెలిసేక.. ఇక అతని స్థితి ఎలా వుంటుంది!

అతని ముఖంలో రంగులు మారడం... మనిషి కర్రలా తీవ్రమైన టెన్షన్‌తో బిగుసుకు పోవడం పద్మ గమనిస్తోంది. షాక్ తిన్నట్టు లేచి నించుండిపోయిన ప్రకాష్... తన స్టాటస్ ముందు, అంతస్తు ముందు సమంగా కూర్చోలేకపోడంగా అర్థం చేసుకుంది. ఆమె కిదెంతో గర్వం, తృప్తి నిచ్చేయి.

ప్రకాష్ చేయి స్విచ్చులను తాకింది.

మరుక్షణంలో కేబినంతా చీకటి సముద్రంలో మునిగిపోయింది.

అంతలోనే బెడ్‌లైట్ వెలుగు సన్నగా పరుచుకుంది.

అంత వెలుగు ఒక్కసారిగా అణగారిపోయినట్టుగానే ఆమెలో గర్వం, ధైర్యం చప్న చల్లారిపోయేయి.

దడదడమన్నాయి గుండెలు.

'ఏయ్! మిష్టర్! ఫస్ట్ స్విచ్ ఆన్ ద లైట్' అని అధార్టీ చేయలేకపోయింది. వణికే చేతులు గుండెల మీదికి వెళ్ళేయి. గుండెలు ఆమెవే కాని, చేతులు అతనివి కావు. కాని ఎక్కడ అతని చేతులు రాబందుల్లా వాల్తాయోననే భయం!

బుద్ధిగా ప్రకాష్ రగ్గు కప్పుకొని పడుకోడంతో (థాంక్ గాడ్!) ఆమె గుండెలు తిరిగి పనిచేయడం ఆరంభించేయి.

ఆమె సంస్కారం అతన్ని ఈసడించుకోడం మొదలెట్టింది.

మేనర్‌లెస్ బ్రూట్! లైటు ఆర్పే ముందు 'విత్ యువర్ కైండ్ పర్మిషన్' అని అనలేదూ! అవును మరి, ఎక్కడికిపోతాయి అలగా బుద్ధులు!

అయితే తిరిగి లైటు వేసుకునే ధైర్యంగాని, వేయమనే ధైర్యంగాని ఆమెకి లేవు అంచేత వర్కరుగాడి వెధవ ముఖం ఎదురుగా కనిపించి చికాకు పెంచే పని లేకుండా చీకట్లోకి, రగ్గులోకి వెళిపోయినందుకు - ఆమె మనసు సంతోషించినట్టు, తృప్తి చెందినట్టు అనుకుంది.

అకారణంగా అతనిపై ఆమె ద్వేషం, చిన్నచూపు కలగడం అతను వర్కరనే సంగతి ఆమెకి తెల్సిన తర్వాతేననేది ఆమెకి తోచలేదు. ఇంతవరకూ అతన్ని ఏ పారిశ్రామిక వేత్తో లేక ఏ వ్యాపారవేత్తోనని భ్రమపడలేదు. కనీసం ఆఫీసరై వుంటాడనుకుంది. అనుకోక ఏం చేస్తుంది! కూర్చున్నది ఫస్టు క్లాసులో! వేసుకున్నవి ఉలెన్ దుస్తులు!

లైటు అడిగి ఆర్పడమనేది మేనర్స్‌కి సంబంధించిన విషయమే. కావచ్చు. అయితే సంస్కారం అతను కోల్పోయాడనుకోడం సరికాదు.

సంస్కారమనేది పుట్టుకతో వచ్చేది కాదు. పూర్వజన్మ సుకృతం కాదు. చదువు సంధ్యల

వల్ల అలవడుతుందని కూడా పూర్తిగా ఒప్పుకోలేం. అలా అని స్వభావానికి అంటగట్టడం కూడా పూర్తిగా సరికాదు. సంస్కారమనేది పుట్టి పెరిగిన సమాజంతో కొంత ముడిపడి వుంటుంది. మరికొంత బతికే తీరుపై ఆధారపడి ఉంటుంది.

అంతకు ముందు అంత చలిలో డోర్ వేయడానికి మొహమాటపడిన సంస్కారం - ఇపుడు ఆమె ఉనికినే ఖాతరు చేయక లైట్ టప్‌మని ఆర్పేసింది.

ఆమెకి మర్యాదిచ్చే స్థితిలోంచి చప్పున జారిపోయాడు. ఆమె ఆధిక్యతను తను అంగీకరించలేదు. అంతే కాదు, ఆమెని రాక్షసంగా మానభంగం చేసేసి - 'ఫో, నీ దిక్కున్నచోట చెప్పుకో' అని అనాలనిపించేటంత భయంకరమైన ఆలోచన కూడా వచ్చింది.

అది అతని సంస్కారాన్ని చిందర వందర చేస్తూ ధ్వంసం చేయడానికి వస్తున్న ఉద్వేగపు టాలోచనలు!

అంతమాత్రాన అతని అవేశం వివేకాన్ని చంపేసే స్థితిలో లేదు. సంస్కారాన్ని మంట గలిపేటంత బలమైనదీ కాదు. అతను అది సులువుగానే గ్రహించగలిగేడు.

అదే సమయంలో ఆమె మొహాన్ని చూడ్డానికి వ్యతిరేకించింది అతని సంస్కారం. ఇంతవరకూ ఏ అందాన్ని, ఏ సౌందర్యాన్ని వీక్షించాలని వువ్విళ్ళూరాడో ఆ అందం, ఆ సౌందర్యం ఏదో జుగుప్సని, ఓ హింసా ప్రవృత్తిని ప్రేరేపిస్తున్నాయి. అందుకే ప్రకాష్ కేబిన్‌లో చీకటి తెర వేసేసాడు.

అయితే అతని ఆలోచనలు నిద్ర పోలేదు. అతన్ని నిద్ర పోనివ్వలేదు.

ఆమె తన శత్రువు భార్య!... పగ తీర్చుకునే అవకాశం వస్తే.. చీకట్లో రగ్గులో నత్తగుల్లలా దాక్కోడం ఏవిఁటి?.. ఇదిగో. నీవేమీ పీక నులిమేయనక్కర్లేదు. మానభంగం చేసేయ నక్కర్లేదు. ఆమె యజమాని, నీ యజమాని ఒక్కడేనని చెప్పు. వాడు చేసిన దుర్మార్గాలు చెప్పు. నిన్నీ పరిస్థితుల కీడ్చిన కథ చెప్పు చాలు... ఈ రాత్రి రాత్రంతా హింస, భయం! ఏ క్షణంలో నీవేం చేస్తావోననే హడల్‌తో గుండె ఆగి చస్తుంది!

ఆ విధంగా మెదడుపై నరాల వత్తిడి.

మరో పక్క గత జ్ఞాపకాల ముసుర్లు.

ఆ రోజులు -

కార్మికులు అట్టుడికిపోతున్న రోజులు.

తమని తామే నిందించుకుంటూ, యూనియన్ని నిందిస్తూ, యజమాన్యాన్ని నిందిస్తూ ఆగ్రహావేశాలు వెళ్ళగక్కుతున్న రోజులు.

సమస్య - జీతాల పెరుగుదల - వేజ్ రివిజన్ మూడేళ్ళు అయినా ఇంకా సెటిలు కాని పరిస్థితి - మరో ఏడాదిలో కొత్త వేజ్ రివిజన్ చేయాల్సి వుండగా పాతది యింకా సెటిలు కాకపోవడం కార్మికుల గుండెల్ని మండిస్తోంది.

యూనియన్ పేరుకే ఉంది.

అది కార్మిక సమస్యలను పరిష్కరించే, పరిరక్షించే స్థితిలో లేనేలేదు. దాన్ని అంత బలహీనంగా చేసిన ఘనుడు కంపెనీ యజమాని శ్రీ రవీంద్ర!

దానికే బిస్కట్లు తినిపించాడో, ఏఏ తావుల్లో దువ్వాడో కుక్కలాగ అతని పాదాలు నాకుతోంది. వర్కర్ల ప్రయోజనాలకి తిలోదకాలిచ్చి యజమాని కావలి కుక్కగా మారిపోయింది.

ఎలెక్షన్లు పెట్టకుండా, కార్మికుల వద్దకి వెళ్ళకుండా – ఏ సమస్యలూ పట్టించుకోకుండా కాలం గడిపేస్తోంది యూనియన్.

ఏ పనిపాటు చేయకుండా, ఏ బాధ్యతలూ నిర్వర్తించకుండా – నేటి రాజకీయ నాయకులతో పోటీపడి – బేవార్సుగా తిరిగేయడానికి అలవాటు పడిపోయిన సోమరులు – ఆ యూనియన్ నాయకులు!

పాతిక రూపాయల వరకూ జీతం పెంచుతానన్నది యాజమాన్యం.

ఆ ప్రతిపాదనని వర్కర్లు అంగీకరించలేదు.

కంపెనీ కొచ్చే లాభాలు, పెరుగుతున్న ధరలూ.... ఇవన్నీ దృష్టిలో పెట్టుకుంటే – నీవు 300 పెంచినా చాలదు. కనీసం వంద రూపాయలైనా బెనిఫిట్ వుండాలన్నారు. తమకి తెలియకుండా ఆ 25 రూపాయలకి యూనియన్ సంతకాలు పెట్టిందో...మరిక హత్యలు జరిగిపోతాయన్నారు వర్కర్లు.

ఆ పరిస్థితిలో నెలల తరబడి సమస్య అలా వుండిపోయింది.

కార్మికుడికి బాధ వుంటుంది. కడుపు మండుతుంది. అతను చేసేది కాయకష్టం. చేసిన కష్టానికి ఫలితం లేనప్పుడు కసి రగుల్తుంది.

ఆ స్థితిలో వాళ్ళను మోటివేట్ చేసి, సమీకరించి ముందుకు నడిపే సమర్థమైన నాయకత్వం వున్నప్పుడు జయం తప్పక కలుగుతుంది.

కాని ఏదీ అక్కడ అలాంటి నాయకత్వం?

కార్మికులు యాజమాన్యాన్ని, యూనియన్ని కలిపి బండబూతులు తిట్టడం తప్ప ఏమి చేయలేని స్థితికి వచ్చేరు.

అది క్రమ క్రమంగా దేనికి దారితీసిందంటే వర్కు స్లోడవున్‌కి! వర్కు స్లోడవున్ చేయమని ఏ లీడరూ పిలుపు ఇవ్వలేదు. వాళ్ళ అసంతృప్తే, వాళ్ళ నిరసనే – వాళ్ళకి తెలియకుండా అందులోకి దించింది. తర్వాత అది ఫేక్టరీ అంతటా ప్రాకి, సోకి... ప్రొడక్షన్ని పూర్తిగా దెబ్బతీసింది.

అది రవీంద్ర వూహించని పరిణామం!

యూనియన్‌ని తన చేతిలో పెట్టుకోగల్గేడుగాని ఏం లాభం? వర్కర్లు యూనియన్ చేతిలో లేరు. అదుపులో లేరు.

వర్కర్లని అదుపు చేసే శక్తి వారికి లేదనే సంగతి రవీంద్ర గ్రహించినప్పటికి – ప్రయత్నించి చూడమన్నాడు యూనియన్ని.

యూనియన్ రవీంద్ర పాదాలపై పడిపోయి "మీరు చెప్పిన ఈ ఒక్క మాట కాదనవల్సి వస్తున్నందుకు మమ్మల్ని క్షమించి వదిలేయండి" అని జారుకున్నారు.

రోజు రోజుకూ వర్కర్ల నిరసన తీవ్రతరమవుతోంది.

లీడరుషిప్పు లేకపోవడం వల్ల - కొద్దిగా గాడి తప్పింది. మిషన్ల మీద, డబ్బారేకుల మీద టూల్స్‌తో ధన్‌ధన్‌మని విపరీతమైన చప్పుడు చేయసాగేరు కార్మికులు.

రవీంద్ర ఆఫీసర్లందర్నీ సమావేశపరచి క్రమశిక్షణ ఉల్లంఘించిన నేరం కింద వారికి ఛార్జిషీట్లు ఇవ్వమన్నాడు. అవసరమైతే సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడవద్దన్నాడు.

ఆఫీసర్లు రవీంద్ర ముందు 'చిత్తం' అన్నారు గాని - వర్కర్లకి ఛార్జిషీట్లు ఇచ్చే దమ్ము లేకపోయింది. ఆ పరిస్థితిలో 'లాకవుట్'ని ఆశ్రయించడం మినహా మరేం చేయలేమనే సలహా ఒకటి ఉమ్మడిగా పడేశారు.

అది రవీంద్రకి మింగుడు పడలేదు. లాకవుట్‌కి సిద్ధపడ్డం అంటే ఒక కంపెనీ యజమాని వ్యక్తిగతంగా ఓడిపోయినట్టవుతుందని భావించేడు. అంచేత తనే ఫీల్డులోకి స్వయంగా దిగేడు. కార్మికులపై తీవ్రమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధపడ్డాడు.

వర్కర్లందరికీ వారం రోజులు పే కట్ చేసేసి జీతాలు బొక్క పెట్టేయమన్నాడు. 'నో వర్క్ - నో వేజ్' అంటూ సర్క్యులర్ జారీ చేసేడు.

దాన్ని వర్కర్లు ఖాతరు చేయకపోగా మరింత రెచ్చిపోయేరు. పూర్తిగా జీతాలు ఎలా రావో చూస్తామన్నారు. పని పూర్తిగా ఎత్తేసి విపరీతమైన చప్పుడు చేయడం కొనసాగించేరు.

ఆ రాక్షస చప్పుడు విని రవీంద్ర పిచ్చెక్కిపోయేడు.

అసలు వీళ్ళ సంగతేవిటో కనుక్కుంటానని షాప్ ఫ్లోర్‌లో రౌండ్స్ వేయడానికి పూనుకున్నాడు.

సమయం రాత్రి 8 గంటలు. రెండవ షిఫ్టు పనిచేస్తోంది.

ఆఫీసరు. వర్కరూ అనే తేడా లేదు - రవీంద్ర అంటే అందరికీ హడల్! అతని గంభీరమైన ముఖం, పట్టబుర్ర, ఆరడుగుల పర్సనాలిటీ, కాస్త లావు చేత అంత పొడవుగా కనిపించడు. కళ్ళు గుడ్లగూబ కళ్ళు. కైజారు లాంటి ముక్కు. అతని ముఖంలో నవ్వు సాధారణంగా కనిపించదు. కంపెనీలో టాప్ టూ బాటమ్ - అందరికీ తనంటే 'ఉచ్చ' అనే సంగతి అతనికి తెలుసు.

రవీంద్ర షాపు విజిట్‌కి అర్థాంతరంగా బయల్దేరుతుంటే వద్దు వద్దని తోటి యాజమాన్యం వారించింది. ఆఫీసర్లు ఇది తగిన సమయం కాదని హెచ్చరించేరు.

ఎవరు వద్దన్నా వినకుండా రవీంద్ర షాప్ ఫ్లోర్‌లో అడుగు పెట్టేడు.

చేతులు వెనక్కి మడిచికట్టి, అడుగులు ఠీవిగా, నెమ్మదిగా, టక్‌టక్‌మని బూట్ల చప్పుడుతో వెళ్తున్నాడు.

అతన్ని చూడగానే వర్కర్లు షాక్ తిన్నట్టయిపోయి చప్పుడు మానేసి, ఎవరి సీట్ల దగ్గర

వాళ్ళు.. అలా మన్ను తిన్నపాముల్లా వుండిపోయేరు. ఒక స్టేజ్‌లో కేవలం రవీంద్ర బూట్ల చప్పుడు తప్ప - మరే చప్పుడు వినబడనంత నిశ్శబ్దం చోటుచేసుకుంది.

రవీంద్ర పరిస్థితి గమనించేడు. వర్కర్లు తమ న్యూసెన్సంతా ఆపి కుక్కిన పేనుల్లా అయిపోవడం చూసి గర్వపడినప్పటికీ - కాస్త దడదడగా కూడా వుంది.

షాపు మలుపు తిరిగేడు.

అతన్ని గమనించని ఉద్యోగులు నలుగురు కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ దొరికిపోయేరు. అంత అకస్మాత్తుగా రవీంద్రని చూసి స్టన్నయిపోయేరు. బిక్కచచ్చి పోయేరు.

వాళ్ళ దగ్గర అతను ఆగేడు. తనని చూసి తమ తమ సీట్లకి వెళిపోతే వదిలేసేవాడే కాని వాళ్ళు అక్కడే నిలబడిపోవడంతో ప్రెస్టేజీ తలెత్తింది. ఆగి ప్రశ్నించక తప్పలేదు.

అది అనుకోని సంఘటన! వాళ్ళు అతన్ని కాస్త దూరంలో చూసి వుంటే పరిగెత్తేవారే. కాని ఆన్‌హాండ్ దొరికిపోవడంతో అలా నుంచుండిపోక తప్పలేదు. అయితే వాళ్ల భయం ఒక మొండితనంగా మారడానికి ఎంతసేపో పట్టలేదు.

రవీంద్రకి కూడా భయంగానే వుంది. తను జాగర్తగానే మాటాడేడు. "మీ మీ సీట్లకి వెళ్ళి పని చూసుకోండి" అన్నాడు.

వాళ్ళలో అప్పటికే మొండితనం, కసి భీష్మించుకు కూర్చోడంతో వాళ్ళు కదల్లేదు.

రవీంద్ర ఫోర్‌మాన్ని పిలిచి వాళ్ళ నలుగురి పేర్లను నోట్ చేసుకుని ఛార్జిషీట్లు ఇమ్మన్నాడు.

ఈ తతంగం జరుగుతున్నప్పుడు వర్కర్లు గుంపులు గుంపులుగా కూడుతూ - ఏమి జరగుతుందోనని చూస్తున్నారు.

రవీంద్ర కెందుకో భయం ఎక్కువయి... ఇక దాటిపోవాలని చూస్తున్నాడు.

అంతలో లైట్లు చప్‌న ఆరేయి.

అంతా గాఢాంధకారం!

అది ఏ దుండగులు కావాలని చేశారో, నిజంగా ఆరిపోయేయో తెలీదు.

చీకట్లో తోపులాట ఆరంభమైంది.

వర్కర్లకి రవీంద్ర ఫుట్‌బాల్ అయేడు. వాళ్ళు అతన్నేం కొట్టడం లేదు. అటూ, ఇటూ తోసేస్తున్నారు. పై ప్రాణాలు పైకే పోతున్నాయి. నోరు పెగలడం లేదు. అతనికాసమయంలో భగవంతుడే కనిపించేడు.

రవీంద్ర కాయం దొర్లుకుంటూ వచ్చి ప్రకాష్‌ని గుద్దింది.

ప్రకాష్‌కి పరిస్థితి అర్థమయి, అర్థమవనట్టుగా వుంది. ఎవరో పడిపోయేరనుకొని లేవనెత్తబోయేడు.

సరిగ్గా అప్పుడే లైట్లు వచ్చేయి!

అంతే! రక్షించబోయిన పాపానికి ప్రకాష్‌ని మిగతా నలుగురితో పాటు సస్పెండు చేసేసారు. తర్వాత, ఫార్మల్‌గా ఎంక్వయిరీ అన్నారు.

'నాకే పాపం తెలీదు, నేను నిర్దోషిని' అని ప్రకాష్ ఎంత మొరపెట్టుకున్నా ఎంక్వయిరీలో అతన్ని దోషిగా నిర్ణయించేరు.

అలా నిర్ణయించడానికి కారణం అతని మీద ఆ సందర్భంలో దొరికిన సాక్ష్యం కన్నా... అంతకు ముందు అతడో ఎర్ర పార్టీ మనిషన్న పెరసనల్ ఫైల్ భోగట్టా బలవత్తరమైన కారణమైంది.

తర్వాత చాలా జరిగింది.

ప్రకాష్ సర్వీస్ నుంచి టెర్మినేట్ చేయబడ్డాడు.

వర్కర్లు వూర్కోలేదు. ఉప్పెనలా విరుచుకుపడ్డారు.

వారి డిమండ్లు ఇవి:

వేజ్ రివిజన్ యిమిడియట్‌గా సెటిల్ చేయాలి.

ప్రకాష్ టెర్మినేషన్ ఆర్డరు, ఆ నలుగురి వర్కర్ల సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించు కోవాలి.

ఆ డిమాండ్లపై ఏ ఒక్కరూ డ్యూటీలకి వెళ్ళకుండా, గేటు బయటనే నినాదాలు చేస్తూ ఉండిపోయారు. రెండో రోజున యూనియన్ కలుగుజేసుకోక తప్పలేదు. వర్కర్లు ఏది చెబితే అది చేయడమే వారి పని అయింది. చచ్చినట్టు అలాగే చేశారు.

సభలూ ... సమావేశాలూ... ఊరేగింపులూ

చివరికి రవీంద్ర దిగిరాక తప్పలేదు. లేబర్ కమీషనర్ మధ్యవర్తిత్వంలో వేజ్ రివిజన్ సెటిలయింది. నో విక్టిమైజేషన్ అన్నారు. టెర్మినేషన్లు, సస్పెన్షన్లు రద్దుకాబడ్డాయి.

అయితే ప్రకాష్‌కి జరిగిన న్యాయం ఏమిటంటే –

అతను ఆ రోజే జాయిన్ అయినట్టు కొత్త టోకెన్ నెంబరు ఇచ్చేరు - అంటే గత సీనియారిటీ అంతా పోయింది. తన పదేళ్ళ సర్వీసు బూడిదపాలయింది. అందరికన్నా జూనియరై ప్రమోషన్లు పొందే అవకాశం లేనివాడయ్యాడు.

పైగా కనస్ట్రక్షన్ డివిజన్‌లో పడేసి తరచు కాంపులంటూ అస్సాం అడవులకి పంపించేస్తున్నారు.

అది జరిగి రెండేళ్ళయింది. యూనియన్ అప్పటి నుంచి 'ఇదిగో, అదిగో' అనడమేగాని తన ఒర్జినల్ సీనియారిటీ గుర్తించే ఏర్పాటుగాని, క్యాంపుల నుంచి విముక్తి లభించడం గాని జరగలేదు.

ఈ క్యాంపుల వల్ల చాలా ఇబ్బందులున్నాయి ప్రకాష్‌కి.

ఇంట్లో రోగిష్టి తల్లి వుంది. ఆమె ఎటువంటి తుపాను దెబ్బలకైనా తట్టుకొని నిలబడే ధైర్యం చిన్నతనం నుంచే తనకి నూరిపోసింది. ఇప్పుడూ అదే ధైర్యం ఇచ్చింది. తన గురించి బాధపడొద్దంది. ధైర్యంగా వెళ్ళమంది. కాని జబ్బులో వున్న తల్లిని ఎలా వదిలి వెళ్ళడం?

ప్రకాష్ భార్య బొత్తిగా భయస్థురాలు. ఏ రాత్రయినా తను ఆలస్యంగా ఇంటికి వస్తే

చాలు గాభరా పడిపోతుంది. పిల్లలిద్దరూ చూస్తే చిన్నవాళ్ళు. పెద్దబాబు స్కూలికి వెళ్తున్నాడు. యింట్లో ఏ ఇబ్బందులైనా చూసుకోవడానికి తను తప్ప మరో మగదిక్కు లేదు.

మరో ఇబ్బంది ఏమిటంటే ప్రకాష్‌కి అస్సాం వాతావరణం పడలేదు. తరచు అతన్ని రోగానికి గురిచేస్తోంది.

అయినప్పటికీ, తనపై ఆధారపడి ఇంతమంది లేకపోతే అతను ఉద్యోగం ఎక్కడైనా చేయడానికి సిద్ధమే. ఎక్కడికో ఒక దగ్గరికి పూర్తిగా ట్రాన్స్‌ఫరు చేసేయమన్నాడు.

పర్సనల్‌గా రవీంద్రకి ఎన్ని విన్నపాలు, మెమోరాండాలు సమర్పించి బాధలూ, విన్నపాలూ చెప్పుకున్నా ఉపయోగం లేకపోయింది.

మరో దారుణమైన చర్య ఏమిటంటే ఈ కంపెనీకో నమస్కారం పెట్టి మరో కంపెనీకి వెళిపోదామని అప్లికేషన్ పెట్టుకుంటే ఆయా కంపెనీలకి తన అప్లికేషన్ ఫార్వార్డు చేయటం లేదు. 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' ప్రొడ్యూస్ చేస్తే తప్ప అప్లికేషన్ కన్సిడర్ చేయం' అంటున్నారు అవతల కంపెనీలు - తను ప్రయివేటుగా చదివిన ఇంజనీరింగ్ డిప్లమా సర్వీసు అతనికే మాత్రం ఉపయోగపడకుండా చేసేసాడు రవీంద్ర. తనేం చేసాడని ఇంత శిక్ష?

ఆర్నెల్ల కిందట -

తల్లి పోయినట్టు టెలిగ్రాం అందుకొని పరిగెట్టుకొచ్చిన అతనికి తల్లి బూడిదైపోయి, కడసారి ముఖం చూసే అదృష్టం కూడా లేకపోయింది.

ఆ సమయంలో తిన్నగా వెళ్ళి రవీంద్రని పొడిచి చంపేయాలనిపించింది....

ఇపుడు-

ఈ రైల్లో, తన పగ తీర్చుకోడానికి అనువుగా, ఎదురుగా రవీంద్ర భార్యాబిడ్డలు!...

❁ ❁ ❁

రైలు విపరీతమైన స్పీడు కొడ్తోంది.

ప్రకాష్‌కి నిద్ర పట్టిందో లేదో!

ప్రకాష్‌కి నిద్ర పట్టిందనుకోవచ్చు - ఏమంటే తుళ్ళిపడి లేచేడు గనుక?

లేవడం వైజాగు స్టేషను వచ్చేసిందని కాదు - పాప కింక పెడుతోంది.

టైము చూస్తే పది నిముషాల తక్కువ పదకుండు!

రైలు విజిలు కన్నా బిగ్గరగా భీకరంగా కేకలేస్తోంది పాప.

'ఏవిటీ న్యూసెన్సు! బంగారం లాంటి నిద్ర చెడగొట్టేశారు' అని గట్టిగా కసరాలని పించింది ప్రకాష్‌కి. ఆ గుంట ముండది ఏం నోరు!

ప్రకాష్ ఆ తల్లీ, పిల్లల వంకే చూస్తున్నాడు.

పాప ఎందుకేడుస్తుందో తెలీదు. నిలబడి ఎత్తుకున్నా వుండడం లేదు. పక్కమీద వేస్తే వుండడం లేదు. కింక కింక. ఒకటే కింక. పాపనసలు పట్టుకోలేకపోతోంది ఆమె. చేతిలో నులుచుకుంటుంటే కాయడం కష్టంగా వుంది తల్లికి.

బిస్కట్లు ఇచ్చినా, మరేమి ఇచ్చినా పుచ్చుకోడం లేదు; చేత్తో కొట్టి పారేస్తోంది. నోట్లో పెడితే వూసేస్తోంది. ఏం కావాలని తల్లి అడుగుతోంది. ఏడుపు తప్ప ఏమీ చెప్పడం లేదు. రెండేళ్ళయినా పూర్తిగా నిండని పాప... ఇక తల్లిలో ఓపిక, ఓరిమి నశించిందిలా వుంది... పిల్లని బాదేస్తోంది.

'పిల్ల ఏడిస్తే ఏడ్వనీయ్' అనుకున్న ప్రకాష్ అలా బాదుతుంటే 'బాదుకోనియ్' అని అనుకోలేకపోయేడు.

చూస్తే క్లాసు మనుషులు - పెద్ద ఫోజులు గాని... చిన్న పిల్లల సంరక్షణ, సముదాయించడం తెలీదు. అతనికి ఆమెపై చాలా కోపం వచ్చింది. అయితే 'పిల్లనెందుకలా కొడతారు?' అనలేకపోయేడు. 'పిల్లనిలా ఇవ్వండి' అని తీసుకోలేకపోయేడు!

ఆమె కళ్ళు నీళ్ళ పర్యంతగా ఉంది. ఆ స్థితి అతని గుండెల్ని కరగదీస్తున్నట్టు అనుమానమొచ్చి సర్దుకున్నాడు.

పద్మ గబగబా బాగ్‌లోంచి గ్రైప్ వాటర్ తీసింది. పాపకి పట్టాలని ప్రయత్నం. పాప చేత్తో విసిరి కొట్టేస్తోంది. అది పట్టాలంటే ఎవరో ఒకరు చేతులు పట్టుకుంటే గాని కుదిరే పని కాదు. ఆమె ప్రకాష్ వైపు చూసింది.

"కొద్దిగా పాప చేతులు పట్టుకోండి" అంది.

అడగడంలో ఏ మాత్రం మర్యాద చూపనట్టు, నౌకరుతో యజమానులు మాటాడే ధ్వని అందులో కనిపించింది ప్రకాష్‌కి.

అటువంటి స్థితిలో 'ఎలా అడిగింది. ఎవరు అడిగేరు' అని సబ్జెక్టివ్‌టీ కెళ్ళకుండా 'ఎందుకడిగింది' అనే అబ్జెక్టివ్ దృష్టి అవసరం అన్న సంగతి తోచినప్పటికీ ఆమెకి సాయం వెళ్ళేస్థితిలో లేడు ప్రకాష్.

'పిల్ల అలా ఏడుస్తూ, ఏడుస్తూ చావనీయ్ ఆ పిల్లతో పాటు నీవు చావు' అనబోయే స్థితిలో వున్నాడు.

ఆమె స్థాయి నుంచి దిగివచ్చినట్టు, దీనంగా అడుగుతున్నట్టు అతనికి తోచింది.

పగ 'సాయం వద్దు' అంటోంది.

పరిస్థితి 'చేస్తే ఏం పోయింది' అంటోంది.

అలా వుండిపోయేడు.

బెడ్ మీంచి పాప పడిపోబోతుంటే గభాల్న లేచి పట్టుకోక తప్పలేదు ప్రకాష్.

పాప కాళ్ళు, చేతులు పట్టుకుని అతను సాయపడగా - ఆమె గ్రైప్ వాటర్ పట్టింది. పాప మింగకుండా వూసేసింది. ఆ తుప్పర్లు ప్రకాష్ ముఖం మీద పడ్డాయి. చిర్రెత్తుకొచ్చింది. టాయిలెట్ కెళ్ళి ముఖం కడుగుకు వచ్చేడు.

పాప కింక తగ్గలేదు. క్షణక్షణానికి కింక పెరుగుతోంది తప్ప తగ్గడం లేదు. ఒక్కోసారి ఆ కింక ఊపిరి తిరగని దగ్గుగా మారిపోతోంది. పాప గిజగిజ గింజుకుపోతోంది.

ఆ కింక తగ్గుతుందని నమ్మకం పోయినట్టుంది తల్లికి... ఆమె కన్నీళ్ళు ఆగడం లేదు.

పిల్ల చేతిలో నిలవక, మెలికలు తిరిగిపోతుంటే... ఇక పట్టుకోలేక వదిలేసి ఏడ్వసాగింది. పాప పొర్లుతూ, దొర్లుతూ ఏడుస్తోంది.

ఆ పాప, ఆ తల్లి... ఇద్దరి ఏడుపులు అతనికి దుర్భరంగా తోచేయి.

రవీంద్రే కాక అతని భార్యాబిడ్డలు కూడా తనని వేధించుకు తినడానికే పుట్టుకొచ్చినట్టు ప్రకాష్‌కి చెడ్డ చిరాకేసింది.

"ఏమండీ, ఎలాగండి, ఏం చేయాలండి. నాకు భయంగా ఉందండి. నా పాప నాకు దక్కదా" – ప్రకాష్‌ని ఏడుస్తూ అడుగుతోంది.

ఆ ప్రశ్నలకి అతని దగ్గర జవాబుల్లేవు. చెప్పాలనిపించలేదుగాని ఆమెకి ధైర్యం కొంత చెప్పొచ్చు.

క్షణకాలం తత్సారం చేసి.. చివరికి ప్రకాష్ దొర్లుతున్న పాపని చేతుల్లోకి తీసుకున్నాడు. తీసుకున్నాడే కాని పాపని పట్టుకోవడమే బ్రహ్మప్రళయంగా వుంది. భుజంపై వేసుకు జోకొడదామనుకున్నాడు. గుండెలపై కాళ్ళతో తన్ని కఱ్ఱలా నిగడ తన్నేస్తోంది.

అంత చిన్నముండ కూడా అలా రాక్షసంగా ప్రవర్తిస్తుంటే అతనికి ఒక్క పక్క కోపం తన్నుకొస్తోంది.

ఆ పిల్లని ఇంతసేపు తల్లి ఎలా ఆపగలిగిందో! ఆశ్చర్యం వేసింది ప్రకాష్‌కి.

ఒక్కగానొక్క బిడ్డ! దక్కుతుందన్న నమ్మకం పోయినట్టుంది పద్మకి. చేష్టలుడిగి, సీటుకి చేర్లబడి వుండిపోయింది. కన్నీరు ఆపే ప్రయత్నం చేయడం లేదు. ఆమె కళ్ళు ఎర్రగా ఉబ్బిపోయి, ముఖం వాచిపోయింది.

ప్రకాష్ చేతిలో నిలవడం లేదు పాప. గట్టిగా అదిమిపెట్టి, భుజం మీద వేసుకు అటూ, ఇటూ తిప్పుతున్నాడు.

అంతకు తప్పించి ప్రకాష్‌కి ఏం చేయాలో పాలుపోవడం లేదు.

మిగతా కేబిన్లలో పాసెంజర్లకి నిద్రాభంగం! గంటకి పైగా, అదేపనిగా, హృదయ విదారకంగా వినవస్తున్న పాప ఏడుపుకి కలవరం చెంది ప్రయాణీకులు ఒకరూ, ఒకరూ రావడం.. ఏమయ్యింది, ఏమయ్యిందని అడగడం – తోచిన సలహాలివ్వడం... తప్పుకోవడం!

వాళ్ళంతా ప్రకాష్‌ని ఆ పాప తండ్రి అనే అనుకుంటున్నారు. అది ప్రకాష్ గమనించ లేదు.

పాపని తన మీదకి తోసేసి, ఆమె అలా ఏడుస్తూ కూర్చోడం అతనికి నచ్చలేదు. ఎలా అయితే నచ్చుతుందో అనేది కూడా అతనికి తట్టడం లేదు.

'ఏ క్షణంలోనో, చప్న గుండాగి చచ్చిపోతుంది పాప' అనిపించగానే ప్రకాష్‌కి గుండె నొక్కినట్టయిపోయింది.

పాప ఒకటే కింక! ఒకటే మెలిక తిరిగిపోవడం!

అక్కడెక్కడో, ఏ మూల కేబిన్‌లోనో వున్న ఒకపెద్దమనిషి విసుక్కుంటూ వచ్చేడు.

"మీరలా పిల్లని చంపేస్తారా?" అని కోపంగా ప్రకాష్‌ని అడిగేడు.

ప్రకాష్‌కి కోపం వచ్చింది.

"అర్థం లేకుండా మాట్లాడకండి. చంపేయడమేమిటి!?"

"అవునయ్యా చంపడవేఁ అంటారు దీన్ని! చంపడం ఇలా అలా కాదు - బలవంతంగా చంపడం...అవును, అంతే!... మరి నాతో అర్థం లేకుండా ఆర్గ్యూ మాని... ముందు డాక్టరు అటెండయే ఏర్పాట్లు చూడండి."

"డాక్టరా!... డాక్టర్నెలా తేవడం?"

ప్రకాష్‌కేసి వింతగా చూసేడు పెద్దమనిషి.

"ఎలాగేవింటి? ఎలాగోలా డాక్టరు వచ్చి తీరాలి. లేకుంటే పిల్ల చచ్చిపోతుంది... ఈ సంగతి కండక్టర్‌తో చెప్పండి. అదీ కుదరకపోతే చైను లాగి గార్డుతో చెప్పండి... డాక్టర్ని ఎరేంజ్ చేస్తాడు... కమాన్ క్విక్! ఇంకా ఇలా నుంచున్నారేం? వెళ్ళండి లేకుంటే పాప దక్కదు. వెళ్ళండి. కండక్టరు ఎక్కడ కునుకుపాట్లు పడుతున్నాడో వెళ్ళి వెదికి పట్టుకోండి - సంగతి చెప్పండి" - తన పని సలహా వరకే అన్నట్టు సలహా యిచ్చిన వెంటనే వెళ్ళిపోయేడు ఆ పెద్దమనిషి.

ప్రకాష్‌కి యిపుడు ఏం చేయాలో తెల్సింది గనుక... ఇక ఏ మాత్రం జాగు చేయకుండా - పాపని ఆమె చేతికిచ్చి - కండక్టరు కోసం పరిగెట్టేడు.

కండక్టరు కనిపించలేదు.

కనిపించని కండక్టరుని వెతికే బదులు - గార్డుని పట్టుకోవడం బెస్టు అనుకొని వెస్టిబుల్ ద్వారా బోగి బోగి దాటుకుంటూ, దాటుకుంటూ బండి వూపుకి తాగిన వాడిలాగ వూగిపోతూ, బేలన్సు కాసుకుంటూ... ఎలాగైతేనేం చివరి దాకా వెళ్ళేడు!

వెళ్తే ఏముంది! గార్డు పెట్టెకి తోవ లేదు!

ఆ పెద్దమనిషి ఇందాక 'చైను లాగి, గార్డుని పట్టుకోండి' అని ఎందుకన్నాడో అర్థమయింది.

చైను లాగక తప్పదనుకున్నాడు. కాని మరోసారి కండక్టరుని వెతికే ప్రయత్నం చేసి, చైను లాగుదామనుకున్నాడు.

లక్కీగా కండక్టరు దొరికేడు - ఖాళీ కేబిన్‌లో నిద్రపోతూ!

కండక్టరుని లేపేడు.

పాప పరిస్థితి చెపితే బలంగా వుండదేమోనని ప్రత్యక్షంగా చూపించేడు.

కండక్టరు మంచివాడులా వున్నాడు తన మనవరాలికే ఆపద వచ్చినంత రెస్పాన్సు ఇచ్చేడు.

"చూడండి. ఈ ఫాస్టు ట్రైన్‌ని అర్థాంతరంగా మధ్యలో ఆపడం వల్ల ఏం ప్రయోజనం లేదు. ఆపడానికి సరైన స్టేషను లేదు. ఏ డాక్టరూ దొరకడు. మరో పావుగంట ఓపిక పడితే ఈ రైలు భువనేశ్వర్ చేరుకుంటుంది. అక్కడ స్టేషన్ మాస్టారు చేత ఫోన్ చేయించండి.

డాక్టర్ని పిలుస్తాడు. ట్రయిను ఆగేది అయిదు నిముషాలే అయినప్పటికి... గార్డుతో చెప్పి ట్రయిను మరి కాస్త సేపు ఆపు చేయించడానికి ప్రయత్నించవచ్చు" అని వాళ్ళ ముఖాల్లోకి చూసి మళ్ళీ అన్నాడు-

"ఇక్కడో చిన్న ఇబ్బంది వుంది. మనం స్టేషన్నుంచి ఎంత రిక్వెస్టు చేసినప్పటికి - అవతల వాడు ఏ దుర్మార్గపు డాక్టరో, వొళ్ళంతా బద్దకంతో పులిసిపోయిన కరోడా డాక్టరో అయి వుంటే - వాడు రానంటాడు - పేషెంట్నే ఆసుపత్రికి తీసుకురమ్మంటాడు - అప్పుడు ఏం చేస్తాం? అవసరం మనది. వెళ్ళక తప్పదు మరి. డాక్టర్ని కసిగా బూతులు తిట్టుకోగలం గాని, పేషెంటుని చంపుకోలేం కదా! అంచేత ఎందుకైనా మంచిది మీరు ఆసుపత్రి కెళ్ళడానిక్కూడా సిద్ధపడటం మంచిది. సామాన్లు క్లోక్‌రూమ్‌లో వుంచి ఆసుపత్రి కెళ్తారు... స్టేషన్‌కి ఆసుపత్రి దగ్గరే! అంతా సవ్యంగా వుంటే - తర్వాత ఎలానూ ఉదయం నాలుగున్నర ప్రాంతంలో మెయిలుంది - దాన్ని కాచ్ చెయ్యవచ్చు" అని చెప్పి వెళ్ళిపోయేడు కండక్టరు.

పద్మకి ఇదంతా వింటుంటే స్టేషన్‌కి డాక్టరు వస్తాడనిగాని, వచ్చి తన పాపని రక్షిస్తాడని కాని నమ్మకం లేకపోయింది.

ప్రకాష్‌కయితే ఆ పావుగంట వరకూ ఈ పిల్ల బతుకుతుందా అనిపించింది.

"డాక్టరు వస్తాడు కదండి... నా పప్పీ బతుకుతుంది కదండీ" - దీనంగా ఏడ్వసాగింది.

"ఫర్లేదు. డాక్టరు వస్తాడండి. పాపకేం భయం లేదు"

ఆమెకి ఆ మాటలు కొండంత ధైర్యం కలుగజేసినట్టుంది.

అతని పక్కన కూర్చొని ఏడుస్తూ అంది - "లేదండి నాకు భయంగా వుందండి ఒకవేళ డాక్టరు రాకపోతే ఎలాగండి.... పప్పీ నాకెలా దక్కుతుందండి... ఆడదాన్ని, అర్ధరాత్రి ఆసుపత్రికి ఏం తీసుకెళ్ళగలనండీ... నాకు తోడు రారూ.. నా పప్పీని రక్షించరూ" ప్రాధేయపడింది పద్మ.

ఆ సమయంలో తను ఉన్నత తరగతికి చెందిన స్త్రీని అని కాని, అవతల వాడు లో క్లాస్‌కి చెందినవాడనిగాని ఆమె మర్చిపోయి వుండాలి.

ఆమెకపుడు ప్రకాషే భగవంతుడు.

అతని భుజంపై చేయి వేసి తన తలని ఆ భుజంపై వాల్చేసింది.

ప్రకాష్ కెందుకో ఆ స్థితి ఎంబ్రాసింగ్‌గా వుంది. ఆమె నుంచి నెమ్మదిగా వేరుపడి -'మరేం పర్లేదు - అధైర్యం చెందకండి. స్టేషన్‌కి డాక్టరు రాకుంటే... ఆసుపత్రికి తప్పక నేను వస్తాను" అన్నాడు.

పాప కింక వల్ల మాటలు సరిగా వినపడలేదు. మరోసారి కన్‌ఫర్మ్ చేసుకుంది. వరదలో కొట్టుకుపోతున్న తనకి ఆసరగా మాను దొరికినట్టు ఆ మాట ఎంతో ధైర్యాన్నిచ్చింది కాని తీరం చేరేదాక భయమే. అంచేత అతను ఎడంగా జరిగినా.. ఆమె అతనికి దగ్గరగానే జరిగింది.

'రోజూ యీ దేశంలో పదివేల రైళ్ళు పరుగులు తీస్తున్నాయి. అందులో రోజూ 7.4 మిలియన్ల ప్రయాణీకులు పయనిస్తున్నారు. అన్ని రైళ్ళు, అంత మంది ప్రయాణీకులు వుండగా. ఈ రైల్లో, ఇంతటి నిస్సహాయస్థితిలో వున్న నాకే రావాల ఈ దుస్థితి' అనుకుంది పద్మ.

"ఏ ఆయానో తోడు తీసుకుబయల్దేరుంటే బాగుండేదండి" అన్నాడు ప్రకాష్. ఫస్టుక్లాసు ప్రయాణీకులు తమతో సర్వెంట్స్‌ని కూడా తెచ్చుకునే ఫెసిలిటి వున్నట్టు విని వున్నాడు.

నిజమే ఆయా వుంటే బాగుండేది. కాని తనే పరిస్థితిలో బయల్దేరిందో అతనికేం తెల్సు?

❀ ❀ ❀

ఆ రోజు...

అంటే నెల కిందటి మాట -

రవీంద్ర ఢిల్లీ టూర్‌కి వెళ్ళేడు. పది రోజుల టూర్. కాని వారం రోజులకే పని అయిపోడంతో తిరిగి వచ్చేసాడు. విమానం దిగి డైరెక్ట్‌గా కంపెనీకి వెళ్ళాడు - అర్జంటు కాగితాలు చూడాల్సి వుంది!

పని ముగించుకొని కుర్చీలోంచి లేచేటప్పటికి బాగా రాత్రయింది.

ఇంటికి బయల్దేరి వస్తున్నట్టు పద్మకు ఫోన్ చేయబోయేడు - అలవాటు ప్రకారంగా.

కాని ఏదో చప్పున స్ఫురించగానే... తీసిన రిసీవర్‌ని క్రెడిల్ మీద టక్‌మని పెట్టేసేడు. సిగరెట్ వెలిగించేడు. ఒక గట్టి దమ్ములాగి, చిన్న నిట్టూర్పు విడిచి... గబ గబ మెట్లు దిగి ...కారెక్కాడు.

బంగళాకి కారు వచ్చిన చప్పుడు గాని, మేడ మెట్లెక్కిన బూట్ల చప్పుడు గాని గెడ వెయ్యడం మరచిన తలుపు కిర్‌మని తెరుచుకున్న చప్పుడుగాని పద్మ వినే స్థితిలో లేదు.

టప్‌మని వేసిన లైటులో ద్వారం దగ్గర రవీంద్ర విగ్రహం కనిపించింది.

ఆ సమయంలో మంచం మీంచి 'డాలింగ్' అంటూ పరుగున వెళ్ళి చుట్టుకుపోయేదే! కానప్పుడు అర్ అండ్ యమ్ కంపెనీ డైరెక్టర్ అమిత్ ముఖర్జీని చుట్టుకుపోయి వుంది. రెండు శరీరాలు నగ్నంగా పాముల్లా పెనవేసుకుపోయి వున్నాయి!

ఆ సీను చూసింది చాలిక అన్నట్టు లైటు అర్పేసాడు.

ధన్‌మని తలుపులు మూసుకున్న చప్పుడు. టకటకమని బూట్లు మెట్లు దిగిన చప్పుడు.. తర్వాత కారు సర్రున కదిలిన చప్పుడు.. పద్మ కిపుడు స్పష్టంగా వినబడింది.

ఆ ఎయిర్ కండీషన్డ్ గదిలో... ముచ్చెమటలు పోయలేదు గాని... అవమానంతో కుంచించుకుపోయింది. భర్తకి రెడ్‌హాండెడ్‌గా దొరికిపోయాననే భయం, సిగ్గు కన్నా రోషం పడగ విప్పింది. అభిమానం పొడుచుకొచ్చి బుసలు కొట్టింది. మంచం పక్కనున్న టెలిఫోన్‌ని నేలను బాది ముక్కలు ముక్కలు చేసేసింది. ఇల్లంతా చిందర వందర చేసేసింది. ముఖర్జీ ఆమెను సముదాయించడానికి భయపడి.. నెమ్మదిగా జారుకున్నాడు.

పద్మకి ఆ యింట్లో ఒక్క క్షణం కూడా వుండడానికి యిష్టపడలేక పోయింది. పుట్టింటికి

ప్రయాణమయ్యింది. ఆమె తండ్రి కలకత్తాలో ఒక పారిశ్రామిక వేత్త. పాపని తీసుకొని రవీంద్రకి చెప్పాపెట్టకుండా కలకత్తా వెళ్ళిపోయింది.

పద్మ అలా వెళిపోతుందని రవీంద్ర ఊహిచంలేదు. షాక్ తినేశాడు.

పరాయి మగాళ్ళతో ఆమె 'స్నేహాన్ని' రవీంద్ర గమనించీ, గమనించనట్టే వూర్కునే వాడెప్పుడూ. అది తమ సర్కిల్‌లో అతి సహజాతిసహజమైన విషయంలాగు ఆత్మవంచన చేసుకు తృప్తి పడ్డం అలవర్చుకున్నాడు.

అలాంటిది... ఆవేళ అతడికేమయిందో తెలీదు. ఆ రోజు అర్థాంతరంగా వచ్చి, అదీ దొంగతనంగా వచ్చి, టక్కన లైటు వేసి, అంత వేగంగానూ దాన్ని ఆర్పేసి పైగా ధనేల్మని తలుపు వేసి... పద్మకి పట్టరాని రోషం, కోపం రప్పించినవాడయ్యేడు.

పప్పీని చూడకుండా, పద్మ లేకుండా తను వుండలేననేది 15 రోజుల్లో అతనికి స్పష్టంగా తెలిసిపోయింది.

రమ్మని పిలవడానికి అభిమానం. ఆ అడ్డుని దాటడానికి మరో వారం పట్టింది. ఇక పిచ్చెక్కే స్టేజులో తనే బయల్దేరాడు.

రవీంద్ర రావడంతో ఆమెకి రోషం, దుఃఖం మరీ ఎక్కువయింది. అతను ప్రాధేయ పడుతున్న కొలదీ మరీ రెచ్చిపోయింది.

ఆమె రానన్నది.

'లేదు నీవు రావాలి. పప్పీ నాకు కావాలి. మీ ఇద్దరూ లేకుండా నేను బ్రతకలేను' అన్నాడు. అర్జెంటు మీటింగ్ ఒకటి ఎటెండవ్వాల్సి వుండడంచేత మీ కోసం ఎదురు చూస్తుంటాను అని చెప్పి వైజాగ్ వచ్చేయక తప్పింది కాదు రవీంద్రకి.

వెళిపోయేటప్పుడు అతని కళ్ళల్లో నీళ్ళు చూసి చలించి పోయింది.

ఇక ఎన్నడూ కూడా తన 'స్వేచ్ఛ'కి అడ్డు రానంటే రానన్నాడు. జరిగిందానికి క్షమించమన్నాడు... ఆలోచిస్తే భర్త ఎంతో అమాయకుడిగా తోచేడు. భర్త దగ్గరికి వెళిపోవాలనే కోరిక రోజు రోజుకీ బలపడి ఆమె నక్కడ నిల్వనీయలేదు. వెంటనే వెళ్ళి గుండెల కదుముకొని అతన్ని సేద తీర్చాలనిపించింది అంతే!

ఆ రోజు ఆకస్మాత్తుగా... కోరమాండల్‌కి వస్తున్నట్టు టెలెక్స్ మెసేజ్ ఇచ్చి బయల్దేరింది. తోడుగా తండ్రే వస్తానన్నాడు. వద్దనేసింది.

తనకేం తెలుసు! పప్పీ మధ్యలో ఇలా ఏడిపించి ప్రాణాలు తీస్తుందని.

✿ ✿ ✿

సమయం పన్నెండు గంటలు!

అంటే నాలుగు నిమిషాలు ముందుగానే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ భువనేశ్వర్‌లో ఆగింది.

పాప కింక మటుకు నాన్‌స్టాప్!

ఆ చిన్ని ప్రాణికి గంటల కొలది అంత గట్టిగా ఏడ్వగల శక్తి ఎక్కడ నుంచి వచ్చిందో!

డాక్టరు రాకుంటే - ఆసుపత్రికి వెళ్ళడానికి అన్నీ సర్దుకొని రడీగా వున్నారు.

రైలు ఆగగానే... కండక్టర్ కోసం ఎదురు చూడకుండా స్టేషన్ మాస్టారు రూమ్‌కి ప్రకాష్ పరిగెట్టేడు.

డాక్టరుకి ఫోన్ చేయించేడు. యస్ యమ్ పరిస్థితిని సరిగా వివరించలేకపోడంతో ఫోను ప్రకాష్ తీసుకొని వివరంగా చెప్పి, మీరు రాకుంటే పాప ప్రాణాలు పోతాయని వెంటనే బయల్దేరి రావాల్సిందని రిక్వెస్టు చేశాడు.

డాక్టరు ఏ మూడ్‌లో వున్నాడో లేక కేసు విని మూవ్ అయేడో - వెంటనే రావడానికి ఒప్పుకున్నాడు.

అర్ధరాత్రి, అపరాత్రి అనకుండా ఓపిగ్గా డాక్టరు రావడం నిజంగా పెద్ద విశేషం! అటువంటి పరిస్థితుల్లో డాక్టరు తప్పక ఎటెండు కావాలనేది రైల్వే రూలు! అయితే రూలు ప్రకారం ఏదైనా జరిగితే ఇది కలా! నిజమా అని నమ్మలేని స్థితిలో మనం వుంటున్నాం!

రైలు కొంత ఎర్లీ టైములో వచ్చినప్పటికీ - ఎందుకైనా మంచిదని గార్డు దగ్గరకెళ్ళి కొద్దిగా రైలుని నిలపమని రిక్వెస్టు చేసి - అందుకు సుముఖున్ని చేశాడు.

చాలా వేగంగా డాక్టరు వచ్చేడు.

కంపార్టుమెంటు కొచ్చి పాపను ఎగ్జామిన్ చేశాడు. పొట్ట అటూ ఇటూ నొక్కేడు. తడి సబ్బు ముక్క ఉపయోగించి ఎనీమా చేసేడు. పాపకి సుఖ విరేచనం అయింది. అంతే! అంత ఏడుపూ టక్‌మని కట్టేసింది. చుట్టూ మూగిన వాళ్ళు ఎవరి కేబిన్లకి వాళ్ళు వెళ్ళిపోయేరు.

పాప నిద్రపోడానికి కాబోలు ఇంజక్షన్లు ఏవో చేశాడు.

డాక్టరు కిట్‌బాక్ సర్దుకొని లేచేడు. ఆ కిట్‌బాగ్‌ని పట్టుకొని డాక్టరు వెనుకగా రైలు దిగేడు ప్రకాష్.

ప్లాట్‌ఫాం మీద జనం పలచగా వున్నారు. రైలు కదలడానికి సిద్ధంగా వుందని అనౌన్సుమెంటు.

"పాపకేం ఫర్వాలెదులెండి.. మరిక సెలవు" అన్నాడు డాక్టర్.

"థాంక్స్" అన్నాడు ప్రకాష్.

థాంక్స్‌ని జేబులో వేసుకుపోడానికి సిద్ధంగా లేదు డాక్టర్.

ఫీజులు దగ్గర డాక్టర్లకీ, ప్లీడర్లకీ మొహమాటాలు వుండవు.

ఫీజు అడిగేశాడు డాక్టరు - పాతిక రూపాయలు!

ప్రకాష్ నాలిక కర్చుకొని, గభాల్న జేబులో చేయి పెట్టి ఫీజు చెల్లించేశాడు.

డాక్టరు కదిలేడు.

రైలు కదిలింది.

ఏవిటిదంతా!.. ఏం చేస్తున్నాడు తను..

తను చేస్తున్నదంతా తనకే నమ్మకం లేనిదిగా, అస్వాభావికంగా తోస్తోంది. తోచి

నవ్వాలనిపించింది ప్రకాష్‌కి.

ప్రకాష్ ఇంకా కేబిన్‌లోకి రాకపోవడంతో ఆందోళన చెందినదై... కిటికీలోంచి తల వంచి ప్రకాష్‌ని పిలిచింది.

నవ్వుకుంటూ రైలెక్కేడు ప్రకాష్.

✿ ✿ ✿

రైలు స్పీడు అందుకుంది. చలి కొంత తగ్గుముఖం పట్టింది.

ఇంతవరకూ అందరి ప్రాణాలు తీసిన పాప చక్కగా నిద్ర పోతోంది.

నిద్ర పోనిది ప్రకాష్, పద్మ.

డోర్ క్లోజ్ చేసి, లైటార్పి పడుకున్నారు.

అవతల బెడ్‌పై ప్రకాష్... ఇవతల బెడ్‌పై పాప పక్కన పద్మ.

పాప పక్కన కాకుండా ప్రకాష్ పక్కన పడుకోడానికి ఆమె అభ్యంతరం చెప్పదు- అతను ఆమెను కోరేపక్షంలో! అయితే అది ఆమె కోరిక కాదు.. కృతజ్ఞత. ఆ సమయంలో అతను ఏమి అడిగితే అది ఇచ్చేయడానికి సిద్ధం! అతను తన వర్గం వాడై వుంటే.. అతడు కోరకుండానే అతని పక్కలోకి చేరిపోయి వుండేది. ఆ సమయంలో కూడా తరగతి గుర్తుకు వచ్చినందుకామె బాధపడలేదు. అంత సాయం చేసినవాడు తన తరగతి వాడు కాకుండాపోయేడనే బాధ పడింది.

పద్మ కెందుకో యింకా భయం బెదురు తగ్గినట్టు లేదు. ఏ క్షణంలో పప్పీ లేచి మళ్ళీ కింక మొదలెడుతుందేమోనని భయం! పప్పీ తన నింతవరకూ ఏడిపించుకు తినేయడం వల్ల పద్మకి మొత్తం ప్రయాణమే భయం కలిగిస్తున్నట్టుగా ఉంది.

"పాపకి మరేం భయం లేదు కదండీ. నా కెందుకో భయంగా వుంది" అంది.

"భయమెందుకండీ... పాప పడుకుంది కదా... మీరూ పడుకోండి.. మరేం ఫర్లేదండి... పాపకేం భయంలేదని డాక్టరు చెప్పేడు. డాక్టరుకి ఫీజు ఇచ్చేటప్పుడు మరోసారి అడిగేను కదా. భయం లేదన్నాడు"

"డాక్టరు ఫర్వాలేదన్నాడండీ... అయితే ఫర్వాలేదన్నమాట" అని మరోసారి ఫర్వాలేదనేది కన్‌ఫర్మ్ చేసుకుంది గాని 'అరె! ఫీజు చెల్లించారా... మీరు చెల్లించడమేమిటి? బలేవారే.. తీసుకోండి' అని ఆమె అనలేదు, చెల్లించలేదు.

చెల్లించేస్తుంది అనుకున్నాడు ప్రకాష్. డాక్టరుకి తను ఫీజు చెల్లించాడనేది ఆమెకి తెలీదు. ప్రకాష్ స్పష్టంగా డైరెక్టుగా అడిగేస్తే ఆమె తప్పక ఇచ్చేసును. కాని అడగడానికి మొగమాటపడ్డాడు. అంచేత డైరెక్టుగా అడగలేక... ఆ విధంగా మాటల్లో ఇరికించి తెలియజేశాడు. పోతే పోనీయ్ అని వదిలేయగల్గేటంత చిన్న మొత్తం కాదు గదా!

ఆ పాతిక రూపాయలు పద్మకి చిన్న మొత్తమే... పోష్ హోటల్లో తనిచ్చే టిప్ అంత లేదు ఆ మొత్తం! ఆఫ్టరాల్ అంత చిన్న మొత్తం గనుక. చెల్లించాలని తట్టకపోయి వుండొచ్చు

లేదా ప్రకాష్ మాటల్లోంచి ఫీజు విషయం కన్నా పాప ఆరోగ్యం గురించి మాత్రమే రిసీవ్ చేసుకునే స్థితిలో వుండి వుండాలి. లేకుంటే ఎందుకీయదూ.

అయితే మళ్ళీ మరొకసారి తను చెల్లించిన ఫీజు విషయం ఎత్తడానికి అతనికి మనస్కరించలేదు. ఒక నిట్టూర్పు విడిచి వూరుకున్నాడు.

ప్రకాష్ నిద్రలోకి దిగబోతూంటే ఆమె కబుర్లలోకి దింపింది.

"ఎక్కడ నుంచి వస్తున్నారు?"

చెప్పాడు.

"ఏం పనిమీద?"

"కంపెనీ డ్యూటీ మీద"

"అంటే మీకు కూడా టూర్లు వుంటాయన్నమాట" ఆశ్చర్యపోయింది.

టూర్‌లంటే రవీంద్రలాగా విమానాల విలాసాల యాత్ర అనుకుంటోంది కాబోలు!

"మీరవి టూర్లనుకుంటే నాకేం అభ్యంతరం లేదు గాని – నాకు మాత్రం అది శిక్షే! కారాగారవాస కాంపులు. కాన్‌సెంట్రేషన్ కాంపులు. నా భార్యాబిడ్డల చెంతన వుండనీయకుండా, చచ్చిన తల్లి చివరి చూపులు కూడా దక్కనీయకుండా అన్యాయంగా నాకు విధించిన శిక్షేనమ్మా ఈ కాంపులు" అని ఉద్వేగంగా అన్నాడు.

'ఇదంతా ఆ దుర్మార్గుడు, నీ మొగుడనబడేవాడు చేసాడు' అన్న మాట నోటి దాక వచ్చింది కూడా.

పద్మకి జాలేసింది.

"మీరేం బాధపడకండి... మా వారితో చెప్పి మీకిక ఏ కాంపులు పడకుండా చూస్తాను" అంది.

ప్రకాష్ క్షణం నివ్వెరపోయి – తర్వాత నవ్వేసాడు. పెద్దగా నవ్వేసాడు. పకపకా నవ్వేసాడు.

అలా ఎంతసేపో నవ్వుతూ వుండిపోయే ప్రకాష్.

పప్పీ ఏడుపు లాగే... ప్రకాష్ నవ్వు కూడా భయం కలిగించినట్టుంది, మరి కిక్కుర్మనలేదు పద్మ.

✿ ✿ ✿

ప్రకాష్ గభాల్న నిద్ర లేచేటప్పటికి భళ్ళున, తెల్లగా, తెల్లారిపోయి వుంది.

పద్మ నిద్ర లేవడమేకాదు చక్కగా తయారయి కిటికీలోంచి చూస్తోంది.

పప్పీ తల్లి ఒడిలో దూకుతూ ఆడుకుంటోంది.

ప్రకాష్ ఒక పెద్ద ఆవలింత తీసి, లేచి – టైము చూసుకున్నాడు.

ఆరు – పది నిముషాలు.

గబగబా కాలకృత్యాలు కావించి, సామానంతా సర్దుకొని, బెడ్‌ని ఎత్తేసి సీటుగా మార్చి కిటికీ దగ్గర కూర్చున్నాడు.

కిటికీలోంచి వచ్చే గాలి మరీ చలిగా కాకుండా హాయిగా వుండి ఆహ్లాదం కలిగిస్తోంది.

పద్మ కిటికీలోంచి అలా ప్రకృతిని చూసి పరవశించి పోతోంది.

ప్రకాష్‌కి ఆమె పద్మలా కాకుండా మరెవరో కొత్త పేసింజరు వచ్చి కూర్చునట్టుగా అనిపించింది.

'గుడ్‌మాణింగ్ అంటే గుడ్ మాణింగ్' అని తప్ప మరే సంభాషణసాగలేదు. ఆమెకి కిటికిలోంచి చూడ్డమే ఎంతో హాయిగా వుంది.

పొగమంచుతో నిండిన చెట్లు, చేమలూ, కొండా కోనలూ చూస్తుంటే నయనానంద కరంగా వుంది పద్మకి.

రైలు వైజాగ్ పొలిమేరల్లోకి రాబోయేటప్పటికి ఆమె ఆనందమంతా మంచులా కరిగిపోయింది.

దృశ్యం – చెట్లు, చేలు పోయి డామిట్! ఆడా మగ చెంబులు, చెంబులతో దర్శనం!

డర్టీ కంట్రీ! ఈ దేశాన్ని ఇందిరాగాంధీయే కాదు ఏ హిట్లరూ, ముసోలినీ కూడా బాగుచేయలేరనుకుంది. సముద్రపు అంచునున్న ఈ విశాఖపట్నం అమెరికాలో వుంటే – ఏ న్యూయార్కు నగరంలానో భాసిల్లిపోయేది కదాని బాధపడింది.

అదిగో, అదిగో వస్తోంది వాల్తేరు స్టేషన్!

కోరమాండల్ ప్లాట్‌ఫామ్ మీదికి ప్రవేశిస్తుంటే... పద్మ కిటికిలోంచి తల పెట్టి.. కళ్ళు ఇంతింత చేసి చక్రాల్లా తిప్పుతూ రవీంద్రని వెదికేస్తోంది.

చేతులు కట్టుకుని ప్రకాష్ ఆమె కేసి వింతగా చూస్తున్నాడు.

అంతలో ఆమె కళ్ళు ఒక్కసారిగా మెరవడం, పెదవులు నవ్వుతో విప్పారడం.. ఆమె చేయి పూర్తిగా అవతలకి పోనిచ్చి.... అదే పనిగా ఊపడం అలా చూస్తున్నాడు ప్రకాష్.

పప్పీకి 'పప్పా' వచ్చేడని చూపించి పాప చేతిని గాలిలో ఆడించింది పద్మ. రైలు ఆగింది.

ఆగిందో లేదో కాబిన్‌లోకి గభాల్న దూసుకువచ్చేసాడు రవీంద్ర.

రాగానే పప్పా చేతుల్లోకి పప్పీ వురికేసింది. పప్పీ ముద్దులు పెట్టేసింది. తర్వాత పప్పా ముద్దులు పెట్టేసాడు. పద్మ దగ్గరికి వచ్చింది. ఆయన ఇంకా దగ్గరికి తీసుకుంటున్నాడు.

లైసెన్సు కూలీలు చొరబడ్డారు. లగేజ్ ఇద్దరు కూలీల నెత్తి మీదకి చేతుల్లోకి వెళ్ళింది. కూలీలు లగేజ్‌తో కిందకు దిగేరు. రవీంద్ర పాపని ఎత్తుకు దిగేడు. పద్మ రవీంద్ర వెనుక దిగింది.

ప్రకాష్ అలా చేతులు కట్టుకు వుండిపోయేడు!

జరిగిందంతా అతని కళ్ళ ముందు ఒక్క క్షణం మెరిసి మాయమయింది.

అతనూ అక్కడ దిగాల్సినవాడే కాని పాదాలు భూమిని అంటుకుపోయినట్టు అతను కదల్లేకపోయేడు. నీరసపడిపోయేడు.

తనకి అప్పుడెప్పుడో చదివిన గోపీచంద్ కథ గుర్తుకొచ్చింది. ఎందుకు గుర్తుకొచ్చిదంటే

ఆ కథలోనూ ఆడది ఇలాగే ప్రవర్తిస్తుంది. అంటే ఆడవాళ్ళంతా ఇంతే అనుకోవాలా?

ఆడదంటే స్వార్థపు ముద్ద, చపల చిత్తం, సంస్కార విహీన, పచ్చి అవకాశవాది, ఏరుదాటేక తెప్ప తగలేసేరకం, ఎదుటి వారిని అవసరానికి వాడుకునే వగలాడి, టక్కులాడి, నెరజాణ... వగైరాలు అనిపించలేదు ప్రకాష్‌కి.

అతనికి అనిపించింది ఒకటే - తను నిజంగా ఆమె భర్త హోదా, స్టేటస్‌కి సమంగానో, దీటుగానో, ఇంకాస్త పై లెవిల్లోనో వుంటే పద్మ తనని ఇలా ఇగ్నోర్ చేయగలిగి వుండేదా! ఇలా ప్రవర్తించేదా?.. అది మరింకేం కాదు. ఆ జాతి అహం! అది వాళ్ళ నైజం! అది వాళ్ళ సంస్కారం!

ఆ విధంగా అనుకోడంతో ప్రకాష్‌కి తన శక్తి తిరిగి కూడదీసుకున్నట్టయింది. ఒక నిట్టూర్పు విడిచి సీటులోంచి లేచేడు.

పై బెర్తు మీద సూట్‌కేస్, హేండ్‌బాగ్ తీసుకొని పోబోతుంటే - అక్కడ కార్నర్‌లో వానిటీ బాగ్ కనిపించింది.

అది నిస్సందేహంగా పద్మదే.

కిటికీలోంచి చూసేడు.

పద్మ. రవీంద్ర కనిపిస్తున్నారు. వాళ్ళు ఇంకా వెళ్ళిపోలేదు. ఎవరో పెద్దమనిషితో మాట్లాడుతున్నారు. ఆ పెద్దమనిషి మరెవరో కాదు. ఆర్ అండ్ యమ్ కంపెనీ డైరెక్టర్ అమిత్ ముఖర్జీ! మొన్న మొన్న పద్మతో రతిక్రీడలు జరుపుతూ ఈ రవీంద్ర పెద్దమనిషికి దొరికిపోయిన పెద్దమనిషే అతగాడు. ఇపుడా ఇద్దరు పెద్దమనుషులూ భుజం భుజం చరుచుకుంటూ, నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడుకుంటున్నారు!

ప్రకాష్ ఆ వానిటీ బాగ్ తెరిచి చూసేడు. ఒక అరలో నోట్ల కట్టలున్నాయి!

ఆలోచించేడు.

ఒక నిర్ణయానికొచ్చేడు. అందులోనుంచి కొంత పైకం తీసి జేబులో పెట్టుకున్నాడు.

ఆ బాగ్ ఆమె కిచ్చేయడానికి పట్టుకురాబోతే మనసు తిరగబడింది.

బాగ్‌ని అక్కడే వదిలేసాడు.

లగేజ్ తనది రెండు చేతులా పట్టుకుని దిగి - పద్మ వాళ్ళ దగ్గరికి వెళ్ళేడు ప్రకాష్.

వెళ్లాడేగాని ప్రకాష్ ఆమె ముఖంలోకి చూడలేదు. చూడాలనిపించలేదు. అంత అసహ్యంగా వుంది. అక్కడ ముళ్ళమీదున్నట్టుంది.

"బెర్తు మీద మీ వానిటీ బాగ్ మర్చిపోయేరు. తీసుకుంటారో తీసుకోరో మీ యిష్టం! అందులో పాతిక రూపాయలు మాత్రం తక్కువుంటాయి - నేను తీసేను - అది డాక్టరు ఫీజుకి ఇచ్చిన నా డబ్బు!" అని ఏ గోడతోనో చెప్పినట్టు చెప్పేసి, అక్కణ్ణించి చరచరా వెళ్ళిపోయేడు.

ప్రకాష్ మరి వెనుతిరిగి చూడలేదు!